# వైద్య విద్యకు మహర్దశ

- మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- కళాశాలల ఏర్పాటు నిబంధనలు సరళం
- నిపుణుల కొరత తీర్చేందుకు చర్యలు
- పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల పెంపు
- పలు కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం



న్యూఢిల్లీ: వైద్యవిద్యను ప్రోత్సహించటానికి, నిపుణులైన వైద్యుల కొరత తీర్చటానికి కేంద్రం నడుం బిగించింది. ఇందుకుగాను భూమి, భవనాల నిబంధనలు సరళం చేయటం.. కొత్త వైద్య కళాశాలల్లో పడకల సంఖ్యను తగ్గించటం.. పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను పెంచటం వంటి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తొలి వంద రోజుల్లో తమ శాఖ సాధించిన విజయాలను, తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ఆరోగ్యమంత్రి గులాం నబీ ఆజాద్ విలేఖరులకు వివరించారు. అందులో పేర్కొన్న ముఖ్యాంశాలు..

- వైద్యం అందుబాటులో లేని, సుదూర ప్రాంతాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు భూమికి సంబంధించిన నిబంధలను సరళం చేశారు. ప్రస్తుతం 25 ఎకరాల స్థలం ఉంటేనే కళాశాలలకు అనుమతి ఇస్తుండగా.. దీనిని 20 ఎకరాలకు తగ్గించారు. ఈ స్థలం 10 కి.మీ. లోపల రెండు భాగాలుగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. మెట్రోపాలిటన్, ఏ గ్రేడ్ పట్టణాల్లో 10 ఎకరాల స్థలం ఉన్నా సరిపోతుంది. ఇందులో బహుళ అంతస్తుల భవనాల్లో కళాశాల నిర్వహణకు అనుమతిస్తారు.
- వైద్య కళాశాలల సంఖ్య తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో జిల్లా ఆస్పత్రులను వైద్య కళాశాలలుగా మారుస్తారు. కంపెనీ చట్టం కింద నమోదైన కంపెనీలు సైతం వైద్య కళాశాలలను ఏర్పాటు చేసుకోవచ్చు. కళాశాలల్లో పడకలు, రోగులు, సిబ్బంది సంఖ్యనూ తగ్గించారు.
- నిపుణులైన వైద్యుల కొరత తీర్చేందుకు అదనంగా ఐదు వేల పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను పెంచుతారు.
- మౌలిక వసతుల ఆధునికీకరణ, అదనపు సిబ్బంది జీత భత్యాల వంటి వాటి కోసం 148 రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలకు కేంద్రం ఆర్థిక సాయం చేస్తుంది.
- బోధనలో సిబ్బంది కొరతను అధిగమించటానికి బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌ల్లో నివసిస్తున్న భారత సంతతి వైద్య నిపుణుల సేవలను వినియోగించుకుంటారు.
- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన వారికి పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో అదనపు వెయిటేజీ ఇస్తారు. ఏడాదికి 10% చొప్పున గరిష్ఠంగా మూడేళ్లకు గాను 30% వెయిటేజీ కల్పిస్తారు.
- ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణులైన వారి సేవలను జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో వినియోగించుకుంటారు. వైద్య విద్యార్థులను డిగ్రీ పూర్తయిన వెంటనే వెనకబడిన, మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవ చేసేందుకు అనుమతిస్తారు.
- ఆరోగ్యరంగంలో మానవ వనరుల జాతీయ మండలి (ఎన్‌సీహెచ్‌ఆర్‌హెచ్)ని ఏర్పాటు చేయటాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. నిపుణులైన సిబ్బందిని సరఫరా చేయటంలో ఇది ముఖ్యమైన నియంత్రణ సంస్థగా పనిచేస్తుంది.

18-09-2009 Sakshi